# సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025




గరిష్ఠం / కనిష్ఠం
35° / 20°

**వాతావరణం**
జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతుంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో కొంత చలి ప్రభావం ఉంటుంది.



విద్యుత్ కాంతులతో కొత్తగూడెం లోని త్రిమాతా ఆలయం

# సర్వం.. శివోహం

మహా శివరాత్రి వేడుకలకు జిల్లాలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించడమే కాక ప్రాంగణాల్లో మామిడి తోరణాలు, చలువ పందిళ్లు వేశారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే శివుడికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు చేయనున్నారు. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– కొత్తగూడెంటౌన్/ బూర్గంపాడు



బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలులో విద్యుత్ దీపాలతో అలంకరించిన శివాలయం

## న్యూస్‌రీల్

### కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నెల్లూరులో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

**నెల్లూరులో రామయ్య కల్యాణం**

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణ వేడుకను ఏపీలోని నెల్లూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మొదట విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు ఈఓ రమాదేవి, సిబ్బంది అరుణ్‌కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న భానుమతి

కొత్తగూడెంటౌన్: మార్చి 8వ తేదీన జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. బీమా కంపెనీ ప్రతినిధులతో మంగళవారం ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మోటార్ వాహన ప్రమాద కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీపడడంతో కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. బీమా కంపెనీల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. సమావేశంలో కొత్తగూడెం మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎ.నీరజ, జూనియర్ సివిల్ జడ్జి ఎ.సుచరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, బీమా కంపెనీల న్యాయవాదులు గాదె రామచంద్రారెడ్డి, రావి విజయ్‌కుమార్, ఎ.ప్రసాదరావు, వి.నాగిరెడ్డి, అంబటి రమేష్, మెండు రాజమల్లు పాల్గొన్నారు.

### రైతుల ఆర్థికాభివృద్ధికి అండగా ఐటీసీ

- డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజేష్

బూర్గంపాడు: జామాయిల్, సుబాబుల్ సాగు చేసే రైతుల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తామని ఐటీసీ పీఎస్‌పీడీ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పొన్నూరు రాజేష్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురంలో ఐటీసీ ప్లాంటేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో జామాయిల్ సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధించిన రైతులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ జామాయిల్, సుబాబుల్‌లో కొత్త వంగడాల రూపకల్పన పరిశోధనలకు ఏటా రూ.40 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. మొక్క నాటింది మొదలు అమ్మకం వరకు అండగా నిలుస్తామన్నారు. భవిష్యత్‌లో జామాయిల్ కర్రకు డిమాండ్ పెరగనున్నందున రైతులు విరివిగా సాగు చేయాలని సూచించారు. ఐటీసీ ప్లాంటేషన్ విభాగం అధికారి ఉషారాణి మాట్లాడగా, వివిధ ప్రాంతాల రైతులు 26మందికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ వివిధ విభాగాల బాధ్యులు శైలేంద్ర సింగ్, రాజశేఖర్, జగదీష్ తమక్, శ్యామ్‌కిరణ్, విశ్వకర్మ, చెంగలరావు, సురేష్‌రెడ్డి, ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాంప్రసాద్, కేవీకే కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ‘భరోసా’తో ఆదరణ !



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

## ఉపాధి పనులతో ఆత్మీయ భరోసాకు లింక్

- పనులకు పెరగనున్న కూలీల సంఖ్య
- ప్రస్తుతం రోజుకు 8,719 మంది హాజరు
- పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని వేడుకోలు

చుంచుపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఇకపై కూలీల జాతర కొనసాగనుంది. భూమి లేని వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12వేలు అందజేస్తోంది. అయితే లబ్ధిదారుల ఎంపికకు ఉపాధి హామీ పనులనే ప్రామాణికంగా తీసుకుంటోంది. ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి పనులకు వెళ్లాలనే నిబంధన ఉంది. దీనిపై అవగాహన లేక జాబ్‌కార్డులు ఉన్నా పలువురు కూలీ పనులకు వెళ్లలేదు. దీంతో గత జనవరి 26న ప్రకటించిన లబ్ధిదారుల జాబితాలో చాలా మందికి చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో ఈసారైనా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కూలీలు భావిస్తున్నారు. ప్రస్తుతం పనుల సీజన్ ప్రారంభం కాగా కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

**ఉపాధితో వెలుగులు..**

గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు నివారించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభించి కూలీల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఈ పథకం ద్వారా పలువురు కూలీలు స్వగ్రామాల్లోనే ఉపాధి పొందుతున్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 100 రోజుల పాటు పని కల్పించాలనేది ఈ పథకం లక్ష్యం. గ్రామాల్లో ప్రతి ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఐదు నెలల పాటు ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. మండు వేసవిలో వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో కూలీలు ఉపాధి పనులపై ఆసక్తి చూపుతారు. జిల్లాలో 481 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేపడుతుండగా ప్రతీ సీజన్‌లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా హాజరవుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఒక్కో గ్రామం నుంచి సగటున 108 మంది కూలీల చొప్పున జిల్లా వ్యాప్తంగా 60 వేల మంది కూలీలు పనులు చేశారు. ఇక మే మొదటి వారానికి కూలీల సంఖ్య లక్షకు చేరువైంది.

గతంలో అధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఉపాధి పనులపై అవగాహన కల్పించి కూలీలను పనులకు రప్పించే వారు. ఈసారి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో ఉపాధి హామీ పథకానికి మరింత ఆదరణ లభించనుందని చెబుతున్నారు. అయితే జిల్లాలో ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని కూలీలు కోరుతున్నారు.

**కూలీల సంఖ్య పెరగొచ్చు**



గతంలో కంటే ఈసారి ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో 8,719 మంది పనులకు హాజరవుతున్నారు. ఈనెల చివరి నాటికి 20 వేల వరకు రావొచ్చు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలుతో ఉపాధి హామీ పథకానికి ఆదరణ పెరగనుంది. వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో తగిన వసతులు కల్పిస్తాం.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

| 481 | 1,35,442 | 2,28,271 | 8,719 | 1,412 |
|---|---|---|---|---|
| జిల్లాలో ఉపాధి పనులు జరిగే జీపీలు | అమల్లో ఉన్న జాబ్ కార్డులు | యాక్టివ్ కూలీల సంఖ్య | ప్రస్తుతం హాజరవుతున్న వారు | వంద రోజులు పూర్తి చేసిన కుటుంబాలు |

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 27న జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో పురుషులు 1,068, మహిళలు 954.. మొత్తం 2022 మంది ఓటర్లు ఉండగా 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల సిబ్బంది శ్రీ రామచంద్ర కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సామగ్రి తీసుకుని ఆయా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు చర్ల, అశ్వాపురం, ఆళ్లపల్లి, ఇల్లెందు, చంద్రుగొండ, దమ్మపేట, లక్ష్మీదేవిపల్లి ఎంపీఓ వలీ హజరత్, ముత్యాలరావు, సీతారామరాజు, కె.చిరంజీవి, ఖాజా మొయినుద్దీన్, రామారావు, ఎం.శ్రీనివాసరావును సెక్టోరియల్ అధికారులుగా, వీరితో పాటు రూట్ ఆఫీసర్లను నియమించామని వివరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎన్ఐసీ అధికారి సుశీల్ పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు గల ఉపాధ్యాయులకు ఈనెల 27న ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని కలెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ఉపాధ్యాయులకు ఈ మేరకు వెసులుబాటు కల్పించాలని యాజమాన్యాలకు సూచించారు.

**వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త..**

ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వడదెబ్బపై జిల్లా ట్రాన్స్‌పోర్ట్ సమావేశం నిర్వహించారు. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ఉదయం 11 – సాయంత్రం 4గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. ఉపాధి పనుల వద్ద టెంట్లు వేయించాలన్నారు. ఆశ వర్కర్ల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలన్నారు. డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, డీడబ్ల్యూఓ లెనీనా, జిల్లా ప్రోగ్రాం అధికారి మధువరన్ పాల్గొన్నారు.

**సకాలంలో పనులు పూర్తి చేయాలి**

ములకలపల్లి : అభివృద్ధి పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీ వద్ద స్థానికంగా తయారు చేసిన మట్టి ఇటుకలతో నిర్మిస్తున్న ప్రహరీని పరిశీలించి పీఆర్ డీఈ సైదులు రెడ్డికి పలు సూచనలు చేశారు. అనంతరం జూనియర్ కళాశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. తొలుత మాధారంలో కొయ్య బొమ్మల తయారీ యూనిట్‌ను సందర్శించారు.



బంజారా ధర్మగురువును సత్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ గుడ్ల రేవతి, ఎంఈఓ సత్యనారాయణ, ఎంపీఓ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఒడ్డురామవరంలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయ వస్త్రధారణ, లంబాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బంజారా ధర్మగురువు బాణోతు భోజ్యానాయక్, శంకర్‌నాయక్, ఆయా పార్టీల నాయకులు నరాటి ప్రసాద్, గుగులోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణాన్ని పరిరక్షించాలి..**

పాల్వంచ: వ్యర్థాలను సద్వినియోగం చేయడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. వ్యర్థాలను సరైన పద్ధతిలో వినియోగించకుంటే ఆరోగ్యం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. పాఠశాలల్లో ఔషధ మొక్కలు, కూరగాయల మొక్కలు నాటాలని సూచించారు. పాఠశాలలో పుట్టిన రోజు జరుపుకునే విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ప్రిన్సిపాల్ మైథిలి పాల్గొన్నారు.

**ఆర్థిక అక్షరాస్యత పోస్టర్లు ఆవిష్కరణ**

ఆర్థిక అక్షరాస్యత – మహిళా సాధికారతపై ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న ఉత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి ఆర్థిక అక్షరాస్యత అవసరమన్నారు. ప్రధానంగా మహిళలు ఆర్థిక వ్యవహారాలపై అవగాహన కలిగి ఉంటేనే ప్రగతి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రామిరెడ్డి, కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యత వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఉద్యోగులు

# కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: త్వరితగతిన కేసులు పరిష్కరించేలా పోలీసులు సమన్వయంతో వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా కోర్టు హాల్‌లో పోలీసు అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల పురోగతిపై పోలీసుస్టేషన్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. నిందితులు దొరకని కేసుల్లో జామీన్‌దార్లకు నోటీసులు ఇచ్చి కోర్టుకు పిలిపించాలని అన్నారు. స్టేషన్ల వారీగా ప్రతీ నెల మొదటి వారంలో చార్జిషీట్లు దాఖలు చేయాలని, ఆఖరి వారంలో దాఖలు చేస్తే అదే నెలలో పరిశీలనకు సమయం సరిపోదని తెలిపారు. జిల్లా కోర్టులో చేపట్టిన నిర్మాణ పనులను వారం రోజుల్లో పూర్తి చేసేలా ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, న్యాయమూర్తులు బత్తుల రామారావు, ఎ.సుచరిత, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ అధికారులు, డీఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## యాతాలకుంట టన్నెల్ భూసేకరణకు రూ.50కోట్లు

ఖమ్మంఅర్బన్: సీతారామ ప్రాజెక్టులో భాగమైన సత్తుపల్లి ట్రంక్(యాతాలకుంట టన్నెల్) నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు సంబంధించి రూ80 కోట్లలో మొదటి విడతగా రూ.50కోట్ల నిధులు విడుదలయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిధులు పెండింగ్ ఉన్న విషయాన్ని మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మొదటి విడతగా రూ.50 కోట్లు విడుదల చేస్తే పనులు ప్రారంభమవుతాయని వివరించడంతో సీఎం ఆర్థికశాఖకు ఆదేశాలు జారీ చేశారని మంత్రి తుమ్మల ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, సీఎం స్పందించి నిధులు మంజూరు చేయడంతో ఈ ఏడాది సత్తుపల్లికి సుమారు రెండు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించే అవకాశముందని తుమ్మల వెల్లడించారు.

# కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

- ఐటీడీఏ పీఓ రాహుల్
- ఉల్వనూరు గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాల సందర్శన

పాల్వంచరూరల్ : విద్యార్థుల భవిష్యత్‌కు తొలి అడుగు పదో తరగతితోనే ప్రారంభమవుతుందని, కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మండలంలోని ఉల్వనూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో కలిసి తరగతి గదిలో కూర్చుని ఇంగ్లిష్ బోధనను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పరీక్షల్లో విద్యార్థులు పాటించాల్సిన మెళకువలపై సలహాలు, సూచనలు చేశారు. తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, తమ పిల్లలు బాగా చదివి వృద్ధిలోకి వస్తారనే ఆశిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు వస్తేనే ఉన్నత విద్యకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. పదో తరగతిలో ప్రతి విద్యార్థి పదికి పది జీపీఏ సాధించాలని పిలుపునిచ్చారు.

**కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్లో తనిఖీ..**

కిన్నెరసానిలో ఆశ్రమ క్రీడా పాఠశాలను పీఓ సందర్శించి ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు గణితం సబ్జెక్టుపై ఉన్న భయాన్ని వీడాలన్నారు. స్టడీ అవర్‌లో లెక్కలను ప్రాక్టిస్ చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సైన్స్ ల్యాబ్‌లో కాలం చెల్లిన రసాయనాలు ఉంటే వెంటనే తీసివేయాలని ఆదేశించారు. ప్రయోగశాలల్లో ఏమైనా పరికరాలు అవసరమైతే తన దృష్టికి తేవాలన్నారు.



ఉల్వనూరు ఆశ్రమ పాఠశాలలో బాలికలతో మాట్లాడుతున్న పీఓ




## క్లుప్తంగా

### శివరాత్రి ఉత్సవాలు షురూ



శివరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్న వేద పండితులు

**అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ):** మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన పూజారి సత్యనారాయనశర్మ ఆధ్వర్యంలో మంగళతోరణాలు, యాగశాల ప్రవేశం, కాలభైరవపూజ, గణపతి పూజ, పుణ్యావాచనం, ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ పీవీ రమణ తెలిపారు. ఆలయ పునఃనిర్మాణ ధర్మకర్త మారగాని శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### పోలింగ్ కేంద్రం తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఓఎస్డీ, ఏఎస్పీ

**దుమ్ముగూడెం:** దుమ్ముగూడెంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఓఎస్డీ పరితోజ్ పంకజ్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ నెల 27న జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### నర్సిరెడ్డిని గెలిపించుకోవాలి




మాట్లాడుతున్న రామాచారి

**భద్రాచలంటౌన్:** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలుపించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు, టీపీటీఎఫ్ బాధ్యుడు ఎమ్. రామాచారి కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకగా పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో మురళీమోహన్, వెంకటేశ్వర్లు, ఎస్.శైలజ, ఎస్.విజయ్‌కుమార్, కొమరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### గాయపడిన వ్యక్తి మృతి



అబ్దుల్ అజీమ్ (ఫైల్)

**సింగరేణి(కొత్తగూడెం):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన సింగరేణి కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కొత్తగూడెం ఏరియా జీకేఓసీ నుంచి సత్తుపల్లిలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఎండీ అబ్దుల్ అజీమ్ ఈ నెల 23న ఖమ్మంలో తన కుమారుడి వద్దకు వెళ్లి వస్తున్నాడు. టూటౌన్ పరిధిలో ఓ బాలుడు ద్విచక్ర వాహనంతో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడిన అజీమ్‌ను హైదరాబాద్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### పట్టుకొని వదిలేశారా?

**ములకలపల్లి:** వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని, వదిలేసినట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలోని చాపరాలపల్లి సమీపంలోని వాగు నుంచి భారీగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు మంగళవారం దాడి చేసి, మూడు ట్రాక్టర్లను ములకలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించే క్రమంలో మాధారం వరకు తీసుకొచ్చారు. తర్వాత అక్కడి నుంచి ట్రాక్టర్లను వెనుకకు పంపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. భారీగా నగదు ఒప్పందం చేసుకుని ట్రాక్టర్లను విడిచిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఎస్‌ఐ కిన్నెర రాజశేఖర్‌ను 'సాక్షి'వివరణ కోరగా.. తాము దాడులు నిర్వహించినా ఎలాంటి వాహనాలు లేకపోవడంతో వెనుదిరిగి వచ్చినట్లు తెలిపారు. ఎంపీడీఓ రేవతిని వివరణ కోరగా.. స్థానికంగా ఇసుక తోలకాలపై ఎలాంటి కూపన్లు మంజూరు చేయలేదని స్పష్టం చేశారు.

### రూ.38 లక్షలకు ఐపీ దాఖలు

**ఖమ్మం లీగల్:** నేలకొండపల్లి మండలానికి తిరువాయిపాటి వెంకటేశ్వరరావు రూ.38.20 లక్షలకు గాను మంగళవారం దివాళా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. రియల్ ఎస్టేట్, వైన్స్ వ్యాపారం చేసిన ఆయన పలువురి అప్పులు తీసుకున్నాడు. ప్రస్తుతం అవి తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ ఏడుగురిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.20,487 |

## ఉపాధి పనుల్లో కూలీల శాతం పెంచండి



తిప్పనపల్లిలో కోళ్ల పెంపకం యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

**చండ్రుగొండ:** ఉపాధి హామీ పథకం పనుల్లో అధికశాతం కూలీలు పాల్గొనేలా కృషి చేయాలని డీఆర్‌డీఓ విద్యాచందన మండల అధికారులకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆమె పలు యూనిట్లను పరిశీలించారు. ఉపాధి పనుల్లో ఫారంపాండ్స్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పని ప్రదేశంలో కూలీలకు సదుపాయాలు కల్పించాలన్నారు. తిప్పనపల్లి గ్రామంలో కోళ్ల పెంపకం యూనిట్, రావికంపాడులో మునగ సేద్యం యూనిట్, చండ్రుగొండలో గేదెల పెంపకం, మద్దుకూరులో మామిడితోట సేద్యం యూనిట్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఈజీఎస్ ఏపీఓ శ్రీను, ఈసీలు నరేశ్, రాజు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



బాధితులతో ఎస్పీ రోహిత్‌రాజు

**కొత్తగూడెంటౌన్:** జిల్లావ్యాప్తంగా సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 170 మంది బాధితులకు ఎస్పీ రోహిత్‌రాజు తిరిగి సెల్‌ఫోన్లను అందజేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అందుకున్న ఫిర్యాదులతో బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను కనిపెట్టామన్నారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నవారు సీఈఐఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా అడిగిన అన్ని వివరాలను కచ్చితంగా నమోదు చేస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులు సెల్‌ఫోన్లను ట్రాక్ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఐటీ సెల్ ఇన్‌చార్జ్ నాగరాజురెడ్డి, ఐటీ సెల్ సభ్యులు, విజయ్, నవీన్, మహేశ్ పాల్గొన్నారు.

## అక్రమంగా తోట నరికివేత..



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, రవికుమార్

**టేకులపల్లి:** మండలంలోని సంపత్‌నగర్‌లో 20 ఎకరాల్లో తాము సాగుచేసిన జామాయిల్ తోటను గుర్తుతెలియని దుండగులు నరికేశారని ఏపీలోని తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెంనకు చెందిన మద్దిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన తన కుమారుడు రవికుమార్‌తో కలిసి మాట్లాడారు. సంపత్‌నగర్‌లో 20 ఎకరాల భూమి పట్టా భూమి ఉండగా ఏళ్లుగా సాగు చేస్తున్నామని రెండో కోతకు సిద్ధమవుతుండగా ఈనెల 21న గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారని, కూలీలను అడిగితే చింతోనిచెలకకు చెందిన ఏలూరి కోటేశ్వరరావు, కొమురం చిట్టిబాబు, కొత్తతండా(జి)కి చెందిన బానోతు శంకర్ పేర్లు చెప్పారని, శంకర్‌ను అడిగితే కోటేశ్వరరావు, చిట్టిబాబు రూ.5 లక్షలకు అమ్మినట్లు చెప్పాడని చెప్పారు. 22న ఎస్పీ కార్యాలయం, బోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. చివరకు సోమవారం ఎఫ్ఐఆర్ చేశారని వెంకటేశ్వరరావు వెల్లడించారు.

## డోలి.. కష్టం తీరాలి..




సుధీర్‌ను అంబులెన్సులో ఎక్కిస్తున్న దృశ్యం

**కరకగూడెం:** ఏజెన్సీలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నట్టు పాలకులు చెబుతున్నప్పటికీ.. మారుమూల గ్రామాల ఆదివాసీలకు డోలి మోతల ఇక్కట్లు తొలగడం లేదు. గర్భిణులు, తీవ్ర అనారోగ్యానికి గురైన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే డోలి కట్టక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నది. మండలంలోని ఆదివాసీ గ్రామమైన అశ్వాపురంపాడుకు చెందిన సుధీర్ మంగళవారం ఉదయం తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారమిచ్చారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో అంబులెన్స్‌ను డ్రైవర్ రోడ్డు మీదే నిలిపాడు. చేసేదేమీ లేక సుధీర్‌ను కుటుంబం సభ్యులు డోలి కట్టుకొని మూడు కిలోమీటర్ల మేర మోసుకుంటూ వెళ్లి అంబులెన్సు ఎక్కించారు. అక్కడి నుంచి కరకగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం మణుగూరు ఏరియాస్పత్రికి రిఫర్ చేశారు.

## నిబద్ధత గల కమ్యూనిస్టును కోల్పోయాం



పోటు ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ

**ఖమ్మం మామిళ్లగూడెం:** సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతితో నిబద్ధత, అంకితభావం కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఖమ్మంలో ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. అంకితభావంతో కమ్యూనిస్టు పార్టీ విస్తరణ, ప్రజా ఉద్యమ నిర్మాణాలకు ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. అమెరికాలో ఉన్న సమయాన విషయం తెలియడంతో దిగ్భ్రాంతికి గురయ్యానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ కుటుంబీకులు నిర్మల, సాత్విక్, పోటు కళావతి, పోటు పూర్ణచంద్రరావు, సీపీఐ నాయకులు దండి సురేష్, జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, గాదె లక్ష్మీనారాయణ, శ్రీరాములు, కూచిపూడి రవి, మడుపల్లి లక్ష్మణ్, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

## కాలుష్య నివారణ కోసమే ఇథనాల్

**ఖమ్మంరూరల్:** కాలుష్య నివారణ కోసమే పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతున్న విషయమై అవగాహన పెంపొందించుకోవాలని డీఎస్‌ఓ చందన్ కుమార్ సూచించారు. ఖమ్మం రూరల్ మండలం సింహాద్రినగర్‌లో జిల్లా పెట్రోలియమ్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ ఉంటుందని, తద్వారా కాలుష్య నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. కాగా, బంక్‌ల డీలర్లు రికార్డులు సరిగ్గా నిర్వహించడమేకాక తాగునీటి వసతి, టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పెట్రోలియమ్ అసోసియేషన్ డీలర్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరప్రగడ రంగనాథ్,కూరపాటి మంజుల మాట్లాడగా డీ.జీ.విజయ్ బాబు, వి.శ్రీనివాసరవికుమార్, నాగబత్తిని రవి, నన్నే ఉదయ్‌ప్రతాప్, ఎం. గోపాల్‌రావు, వి.శ్రీనివాస్, డి.నగేష్, ఏ.విప్లవ్‌కుమార్, ఎం.దిలీప్‌రెడ్డి, డి.రవికుమార్, డి.డానియేల్, పి.వంశీతో పాటు కిషన్, సురేష్ పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై దాడి

**అశ్వారావుపేటరూరల్:** పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు దాడి చేసి, కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని కావడిగుండ్ల శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సోమవారం రాత్రి దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోగా.. ఏడుగురు పరారయ్యారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

**పది మంది అరెస్ట్...**

**అశ్వారావుపేటరూరల్:** పేకాట ఆడుతున్న పది మంది వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. పట్టణంలోని పేటమాలపల్లి శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో దాడి చేసి 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,440 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, తొమ్మిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

### ఇసుక లారీ స్వాధీనం

**ములకలపల్లి:** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని మాధారం మీదుగా ఇసుక లారీ వెళ్తున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి చాపరాలపల్లి శివారులో పోలీసులు లారీని అడ్డుకున్నారు. పత్రాలు సక్రమంగా లేకపోవడంతో సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

### వీధి కుక్కల దాడి

**సుజాతనగర్:** వీధి కుక్కల దాడిలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని సీతంపేటబంజరలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుగులోత్ రాణి వీధిలోకి రాగా కుక్కల గుంపు ఆమెపై దాడికి దిగాయి. దీంతో ఆమె కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇదే గ్రామంలో మరో బాలుడితోపాటు గోల్కొండతండాలో ఒకరిని కుక్కలు కరిచాయని స్థానికులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ రేణుకరాణి

**అశ్వారావుపేటరూరల్:** స్థానిక జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి జి.అశోక్‌కుమార్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేణుకరాణి మంగళవారం తెలిపారు. రెండు రోజుల కిందట వికారాబాద్ జిల్లాలో జరిగిన పోటీల్లో అశోక్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచినందుకుగాను ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. విద్యార్థిని పీఈటీ వసంత్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

### సెక్యూరిటీ గార్డ్ ఆత్మహత్యాయత్నం

**ఇల్లెందు :** స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్ సదానందం మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కొంతకాలంగా ఎప్పుడూ మద్యం మత్తులో తూలుతున్న సదానందాన్ని అధికారులు పలుమార్లు హెచ్చరించారు. ఈ క్రమంలో మంగళవారం సైతం మందలించడంతో పురుగుమందు తాగి.. ఆ విషయాన్ని సహచరులకు చెప్పాడు. దీంతో వారు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, తనను మార్కెట్ చైర్మన్, సెక్రెటరీ ఇబ్బందులకు గురి చేయడం వల్లే ఆత్మహత్యాయత్నం చేసినట్లు సదానందం మీడియా ఎదుట వాపోయాడు.






































